## క్లుప్తంగా

### విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండాలో నూతనంగా నిర్మించిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. దీనిలో భాగంగా ఉదయం పూజారులు వెంకటరమణాచారి, రఘునాథ్ ఆధ్వర్యంలోని వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. చివరిరోజైన బుధవారం ఆలయంలో మూల విగ్రహ, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. సర్పంచ్ బదావత్ రాజునాయక్, ఆలయ నిర్మాణ స్థల దాతలు బానోతు గట్టయ్య, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### షీ టీంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై మల్లారెడ్డి

రామగుండం: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం షీ టీంపై పోలీసులు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో విద్యార్థినులపై పోకిరీల వేధింపులు ఎక్కువవుతున్నాయని, ఈవ్‌టీజింగ్ చేసే విద్యార్థుల సంఖ్య పెరిగిపోతుండడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసుశాఖ ప్రత్యేకంగా షీ టీంలు ఏర్పాటు చేసిందని తెలిపారు. షీ టీం జిల్లా ఇన్‌చార్జి ఏఎస్సై మల్లారెడ్డి, స్నేహలత, హైస్కూల్ హెచ్‌ఎం అజ్మీర శారద, గడ్డం జగదీశ్వర్, అనిత, అయేషా అమీనా హాజరయ్యారు.

### ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన


దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీపీ ఆరెల్లి దేవక్క

రామగిరి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందని ఎంపీపీ ఆరెల్లి దేవక్క అన్నారు. మంగళవారం మండలంలోని పన్నూర్, బేగంపేట గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్నారు. సర్పంచ్‌లు అల్లం పద్మ, బుర్ర పద్మ, జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, వైస్ ఎంపీపీ కాపుర బోయిన శ్రీదేవి, ఎంపీటీసీలు చిందం మహేశ్, మారగోని కరుణ, తహసీల్దార్ రాంచందర్ రావు, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో కాటం భాస్కర్ పాల్గొన్నారు.

### ప్రజాపాలనను వినియోగించుకోవాలి


దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలాజీరావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి కోరారు. మండలంలోని అల్లీపూర్, బొంతకుంటపల్లి, గట్టెపల్లి, నర్సయ్యపల్లి, నీరుకుల్ల, రామునిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీపీ, తహసీల్దార్ దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్‌లు విజేందర్, వసంత, అనిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

రామగుండం: దశాబ్దకాలం గడిచిన ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ముర్మూర్ నిర్వాసితులు అదనపు కలెక్టర్ అరుణశ్రీకి మాజీ వైస్ ఎంపీపీ కొదురుపాక పవన్ వినతిపత్రం అందజేశారు.

### ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ కమిటీ కార్యవర్గం

మంథని: ఎలక్ట్రానిక్ మీడియా మంథని డివిజన్‌కు నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జంజర్ల శంకర్, అధ్యక్షుడిగా పినగాని శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చిట్టిమెల్ల సంతోష్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా మాచిడి కిరణ్, జగన్ గౌడ్, కోశాధికారిగా మాచిడి రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా రావికంటి సతీశ్, కార్యవర్గ సభ్యులుగా మూగ శ్రీకాంత్, శివప్రసాద్, తూర్పాటి రాము, మాచిడి ప్రదీప్‌గౌడ్, పెరుగు రాకేశ్ ఎన్నికయ్యారు.

# వార్డుసభల మార్పుపై ఆగని ఫిర్యాదులు

- కొన్ని డివిజన్లలో రెండు చోట్ల సభల నిర్వహణ
- వార్డు సభలకు భారీగా తరలివస్తున్న ప్రజలు


దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న బల్దియా ఆఫీసు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే ప్రజాపాలన వార్డు సభల వేదికల మార్పుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. మంగళవారం కూడా ఇవే విషయాలపై ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ల ఇళ్లు, మండపాల్లో సభలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. సభల నిర్వహణ, వేదికల మార్పు, ప్రొటోకాల్ వివాదాలపై టీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదులు చేస్తుండడంతో బల్దియా అధికారులు అయోమయానికి గురవుతున్నారు.

**ఒక్కో డివిజన్‌లో రెండుచోట్ల కౌంటర్లు..**

28వ డివిజన్ వినోభనగర్‌లోని హనుమాన్‌నగర్ సమీపంలో తొలుత సభ నిర్వహణకు ఏర్పాట్లు చేయగా, అదే డివిజన్‌లోని న్యూఅశోక థియేటర్ ఎదుట కూడా సభ నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

దీంతో అధికారులు రెండుచోట్ల కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ప్రొటోకాల్ విస్మరించి మరోచోట ఎలా నిర్వహిస్తారని కార్పొరేటర్ పులేందర్ అధికారులను ప్రశ్నించారు.

అలాగే 32వ డివిజన్‌లో కూడా అధికారులు ఇదే తరహాలో కౌంటర్లు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. కార్పొరేటర్ అయిత శివకుమార్ ఇంటి ఎదుట సభ ఏర్పాటు చేసిన అధికారులపై కాంగ్రెస్ శ్రేణులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

స్పందించిన అధికారులు.. ఎల్బీనగర్ కూడలిలో మరో కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్ సభల నిర్వహణను పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

**భారీగా తరలిస్తున్న జనం..**

వార్డు సభలకు దరఖాస్తులు చేసుకోవడానికి జనం భారీగా తరలివస్తున్నారు. ఉదయం 25, 26, 27, 28వ డివిజన్లలో సభలు నిర్వహించగా, మధ్యాహ్నం 30, 31, 32వ డివిజన్లలో ఏర్పాటు చేశారు. మేయర్ అనిల్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న 30వ డివిజన్‌లో సభ నిర్వహించారు. దరఖాస్తులను మేయర్, మున్సిపల్ కమిషనర్ స్వీకరించారు.

**బల్దియా ఆఫీసు కిటకిట**

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన వార్డు సభల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. బల్దియా కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తు సమర్పించడానికి జనం భారీగా తరలివస్తున్నారు. మంగళవారం బల్దియా కార్యాలయం కిటకిటలాడింది.

# అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి


దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: పార్టీల కతీతంగా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల సమన్వయంతో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషిచేస్తానని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ప్రజాపాలన గ్రామసభల్లో భాగంగా ధర్మారం మండలం పత్తిపాకలో నిర్వహించిన గ్రామసభలో మంగళవారం ఎమ్మెల్యే దరఖాస్తుల వివరాలు తెసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. పత్తిపాక గ్రామ రైతులకు ఉన్న సాగునీటి సమస్యను పరిష్కరించడానికి మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. సర్పంచ్ బద్దం సుజాత, సింగిల్ విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, ఎంపీటీసీ బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కోడారి అంజన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, మండల ఉపాధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, బద్దం గంగారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడ్య రూప్లానాయక్, నాయకులు దేవి జనార్ధన్, తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో జయశీల, విద్యుత్ ఏఈ ఖాన్ పాల్గొన్నారు.

**శ్రీఅభయకృష్ణ ఆలయం సందర్శన**

మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని శ్రీఅభయకృష్ణ ఆలయాన్ని మంగళవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ బద్దం సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సురకంటి గోపాల్‌రెడ్డి, బద్దం గంగారెడ్డి, తిరుపతిరెడ్డి, గుండా రవీందర్‌రెడ్డి, కాసిరెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.

### సదరం స్లాట్ బుకింగ్‌కు తప్పని తిప్పలు

కమాన్‌పూర్: ప్రభుత్వం అర్హులైన దివ్యాంగులకు ఆసరా పింఛన్ ఇవ్వడానికి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకొని సదరం క్యాంపునకు వెళ్లేందుకు దివ్యాంగులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో నెలకు 60 మందికి మాత్రమే స్లాట్ బుకింగ్ చేయడానికి సమయం కేటాయించడంతో మీసేవ కేంద్రాలకు వచ్చిన వారికి స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి సమయం లేక సర్వర్ క్లోజ్ చేస్తుండడంతో దివ్యాంగులు నిరాశ చెందుతున్నారు. నెలల తరబడి మీసేవ కేంద్రాలకు వచ్చిన స్లాట్ బుకింగ్ కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి మరింత సమయం కేటాయించాలని పలువురు దివ్యాంగులు కోరుతున్నారు.

### కిక్కిరిసిన ఇంటర్‌సిటీ రైలు


రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

ఓదెల: సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్యలో మంగళవారం ఒకే ఒక్క ఇంటర్ సిటీ ఫాస్ట్ ప్యాసింజర్ రైలు నడిచింది. ఇంటర్ సిటీ రైలులో కాలుబెట్టడానికి వీలులేకుండా ప్రయాణికులు ప్రయాణించారు. మూడో రైల్వేలైను మరమ్మతు పనుల పేరిట రైల్వేశాఖ రామగిరి, సింగరేణి, భాగ్యనగర్, సిర్పూర్‌కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసింది. దీంతో ఒక్క ఇంటర్ సిటీ రైలు మాత్రమే నడవటంతో మంచిర్యాల్, బెల్లంపల్లి, రాంగుండం, పెద్దపల్లి, ఓదెల, పొత్కపల్లి, జమ్మికుంట, ఉప్పల్, హసన్‌పర్తి, కాజీపేట్ రైల్వేస్టేషన్ల నుంచి ప్రయాణికులు, విద్యార్థులతో రైలు కిక్కిరిసింది. రైల్వేశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**పట్టణ ఆటోడ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్**

సుల్తానాబాద్: పట్టణ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడిగా పల్లె శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు ఎనగందుల నాంపల్లి ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ఆటో యూనియన్ సమస్యలతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఉపాధ్యక్షులుగా పల్లె వినయ్, దివాకర్, ప్రధాన కార్యదర్శిగా దండుగుల ఐలయ్య, సహాయ కార్యదర్శిగా రౌతు వెంకటేశ్, కోశాధికారిగా దేశెట్టి రమేశ్, కార్యవర్గ సభ్యులుగా అజయ్, అహ్మద్ పాషా, వంశీకృష్ణ, రాజేందర్, లక్ష్మణ్, మల్లేశ్, లక్ష్మణ్, న్యాతరి రాజేందర్, మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా గుర్రం రాజయ్యగౌడ్ వ్యవహరిస్తారని తెలిపారు. మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్ నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు.

**క్యాలెండర్ ఆవిష్కరణ**

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ పురగిరి క్షత్రియ(పెరిక) సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. పెరిక సంఘం సభ్యులు కులబాంధవులకు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ కోసం బారులు


పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో..


జ్యోతినగర్: పెట్రోల్‌బంకులో వాహనదారుల క్యూ

- సమ్మె జరుగుతుందంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- పెట్రోల్ బంకుల్లో క్యూకట్టిన వాహనదారులు

పెద్దపల్లిరూరల్: పెట్రోల్, డీజిల్ కోసం మంగళవారం బంకుల ముందు బారులు దీరారు. ఈనెల 5 నుంచి బంకు యజమానులు సమ్మెకు దిగుతారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని చూసి ఇలా ఇంధనం కోసం డబ్బాలతో బంకుల ముందు బారులుదీరారు.

**ఇంధనం కోసం వాహనాల క్యూ**

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం రాజీవ్ రహదారి పక్కన గల పెట్రోల్ బంకుల్లో వాహనదారులు పెట్రోల్ కోసం బారులు తీరారు. పారిశ్రామిక ప్రాంతంలోని వాహనదారులు ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్‌ఎఫ్‌సీఎల్ సంస్థలో విధులు నిర్వహించే క్రమంలో వాహనాలను ఉపయోగించడం కోసం పెట్రోల్ తప్పనిసరి కావడంతో వాహనదారులు వాహనాల ట్యాంకులు ఫుల్ చేసుకుంటున్నారు.

**కాల్వశ్రీరాంపూర్‌లో..**

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో మూడు పంపులు, మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో ఒకటి ఉంది. నాలుగు పంపుల్లో పందిల్ల రోడ్డులో ఉన్న పంపులో కేవలం పెట్రోల్ మాత్రమే లభించింది.

సుల్తానాబాద్: మండల కేంద్రంలో పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెలో ఉండడంతో ట్యాంకర్లు బంకులకు రాకుండా నిలిచిపోయాయని యజమానులు తెలిపారు. మంగళవారం రాత్రి సమ్మె విరమించడంతో పెట్రోల్, డీజిల్ వస్తుందని తెలిపారు.

**పెట్రోల్‌బంకుల వద్ద రద్దీ**

పాలకుర్తి: పెట్రోల్‌బంక్‌లు బంద్ అనే వార్త సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో పాలకుర్తి మండల పరిధిలోని పెట్రోల్‌బంక్‌ల వద్ద వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం బారులు తీరారు.

# సింగరేణి రిటైర్డ్ కార్మికుడి నేత్రదానం


అభినందన పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కోల్‌సిటీ: గోదావరిఖనిలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడు జెట్టి మల్లయ్య(75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కాగా సదాశయ ఫౌండేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రిలోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ రఘు నేతృత్వంలో మల్లయ్య నేత్రాలను హైదరాబాద్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మల్లయ్యకు నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అభినందన పత్రాన్ని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి వాసు, టెక్నీషియన్ రఘు అందజేశారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పూదరి కుమార్, పందిళ్ల శ్యాంసుందర్, కోశాధికారి గడ్డం శ్యాంకుమార్, సీనియర్ జర్నలిస్టులు మాదాసు రామ్మూర్తి, మల్లిక్, దయానంద్‌గాంధీ నేత్రదాత కుటుంబ సభ్యులను అభినందించారు.

### అయోధ్య రాముని అక్షింతల శోభాయాత్ర

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో అయోధ్య రాముని అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. ఎంపీటీసీ దండె వెంకటేశం, జూలపల్లి ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, నాయకులు నర్సింహారెడ్డి, తీగుల్ల రాజిరెడ్డి, ఈదుల లక్ష్మారెడ్డి, గాండ్ల రాజు, గన్న సత్యనారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని లొంకకేసారం గ్రామానికి మంగళవారం అయోధ్య రాముని అక్షింతలు చేరాయి. పూజ చేసి గ్రామాల్లో ఊరేగించారు. ఉపసర్పంచ్ ఒజ్జ ఓదెలు, ఒర్రె కిరణ్, వీరవేని శ్రీనివాస్‌గౌడ్, నాంసాని సందీప్, బోయిని వంశీ, శ్రీధర్, కమలాకర్, సురేశ్, రామ్మూర్తి పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని నందిమేడారంలో మంగళవారం అయోధ్య నుంచి వచ్చిన సీతారామచంద్రుల తలంబ్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. దేవి రమణ, బొంకూరి వెంకటేశం, బొడ్డు మొగిలి, నర్సింగం, రమేశ్, సత్యం, నరేశ్ పాల్గొన్నారు.

జ్యోతినగర్: అయోధ్య రామాలయ అక్షింతలు మంగళవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌కు చేరుకున్నాయి. ప్రత్యేక రథంలో వచ్చిన అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేడిపల్లి సెంటర్ నుంచి శోభాయాత్ర చేపట్టారు.

### రోడ్డుకు మరమ్మతు చేయించండి


వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ లావణ్య

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం ముస్త్యాల గ్రామానికి నూతనంగా నిర్మించిన రోడ్డుకు మరమ్మతు చేయించాలని సర్పంచ్ లావణ్య ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సుందిళ్ల, ముస్త్యాల గ్రామాల నుంచి మంథనికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టి కొట్టుకుపోవడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రేడియం, లైన్స్ వెంటనే వేయించాలని కోరారు. జీఎం స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ చెప్పారు.

# ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం


ఎమ్మెల్యే విజయరమణారావుకు సత్కారం

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణలో భాగంగా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం సబ్బితంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను గ్రామస్తులు సత్కరించారు. అంతకుముందు మండలంలోని రంగాపూర్, తుర్కలమద్దికుంట, కాసులపల్లిలో ప్రజాపాలన సభలు జరిగాయి. ఎంపీడీవో రాజు, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీవో సుదర్శన్ దరఖాస్తులు స్వీకరించారు.

**సాగునీరు అందించే బాధ్యత నాదే**

కాల్వశ్రీరాంపూర్: 'నేను రైతు బిడ్డనే.. నాకు రైతులు పడే కష్టాలు, నష్టాలు తెలుసు, రైతుల సాగునీటి బాధలు తీర్చే బాధ్యత నాదే' అని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మంగళవారం కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి, వెన్నంపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామాల్లో అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఎమ్మెల్యేను సన్మానించారు. నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా, ఆపద ఉన్నా తనకు నేరుగా ఫోన్ చేస్తే స్పందిస్తానని పేర్కొన్నారు. కాలువ నీరు విషయంలో సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చానని, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ దగ్గరుండి ఎస్సారెస్పీ కాలువల్లో సిల్టు తీయించారన్నారు. కాలువల సాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సదయ్య పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

ఓదెల: ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని ఎమ్మెల్యే విజయరమణరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రూపునారాయణపేటలో ప్రజాపాలన కార్యక్రమం జరిగింది. పొత్కపల్లి నుంచి రూపునారాయణపేట గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్తులు కోరగా ఎమ్మెల్యే స్పందించి సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి బస్సు నడిపిస్తామన్నారు. సర్పంచు అంకం రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, ఓదెల ఎంపీడీవో జి.సత్తయ్య, కార్యదర్శులు భానుప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు సత్కారం**

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యజమాన్య సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే విజయరమణారావును సత్కరించారు. పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను సత్కరించారు. ట్రస్మా నాయకులు అల్లెంకి శ్రీనివాస్, శ్రీధర్ ఉన్నారు.

# సింగరేణికి విముక్తి లభించింది


సంబరాల్లో బీఎంఎస్ నాయకులు

గోదావరిఖని: ఇన్నాళ్లకు సింగరేణి పరిశ్రమకు విముక్తి లభించిందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. సంస్థ సీఅండ్‌ఎండీని బదిలీ చేయడంతో మంగళవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి, టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎన్.శ్రీధర్‌ను తొమ్మిదేళ్లుగా చట్ట వ్యతిరేకంగా కొనసాగించడం మూలంగా సింగరేణి పరిశ్రమలో విచ్చలవిడిగా రాజకీయ జోక్యం పెరిగిందని ఆరోపించారు. దీంతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయన్నారు. కార్మికులు జీతభత్యాలు, అలవెన్సులు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. మానసిక వేధింపులకు గురి చేయడంతో పాటు చార్జిషీట్లతో ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. అన్నింటికీ భరించి అంతిమంగా ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయవ్యవస్థ గెలిచిందన్నారు. తొమ్మిదేళ్లలో జరిగిన అవినీతి కుంభకోణాలపై సీబీఐ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.సారంగపాణి, సాయవేణి సతీశ్, తాట్ల లక్ష్మయ్య, పోతరాజు భాస్కర్, నీలం శ్రీనివాస్, రాపోలువజ్ర వేణు, బోడకుంట రాజేశం, ఎల్లావుల కోటయ్య, చీకట్ల మల్లేశం, ఆరెల్లి శ్రీకాంత్ బండి మైపాల్, నగేశ్, బండారి శ్యాంసుందర్, గుండెబోయిన భూమయ్య, చెన్నూరి రమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ప్రజాపాలనకు భారీగా దరఖాస్తులు


సుల్తానాబాద్: క్యూలో ఉన్న దరఖాస్తుదారులు


కమాన్‌పూర్: జూలపల్లిలో..


జూలపల్లి: కీచులాటపల్లెలో..


ఓదెల: దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీపీ రేణుకదేవి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం వరకు నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభల ద్వారా సుమారు 25వేలకు పైగా అభయ హస్తం దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయం 33, 34, 35, 36వ డివిజన్లలో, మధ్యాహ్నం 37, 39, 40వ డివిజన్లలో ప్రజాపాలన వార్డు సభలను నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ తెలిపారు.

ముత్తారం: మండలంలోని సీతంపేట, ధర్యపూర్‌లో ప్రజాపాలన కార్యక్రమం జరిగింది. సీతంపేటలో 284, ధర్యపూర్‌లో 126 దరఖాస్తులు వచ్చాయి.

జూలపల్లి: మండలంలోని కీచులాటపల్లె, పెద్దాపూర్ గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. పెద్దాపూర్‌లో డీఈవో మాధవి, ఎంపీడీవో వేణుగోపాలరావు, కీచులాటపల్లెలో మండల ప్రత్యేకాధికారి రంగారెడ్డి, తహసీల్దారు బషీరొద్దీన్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు.

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో దరఖాస్తులు స్వీకరించారు.

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభను అధికారులు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు.

పాలకుర్తి: మండలంలోని గుడిపల్లి, కన్నాల గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు.

ఓదెల: మండలంలోని లంబాడితండాలో మంగళవారం సర్పంచు గుగులోతు లక్ష్మి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో దరఖాస్తులు స్వీకరించారు.

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో దరఖాస్తులు స్వీకరించారు. స్పెషల్ ఆఫీసర్ భాస్కర్ నాయక్, కౌన్సిలర్లు కూకట్ల గోపి, చింతల సునీత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఏఈ శంకర్, మేనేజర్ అలిమోద్దీన్ పాల్గొన్నారు.

### గ్రామాల్లో ఫ్లెక్సీల రగడ

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో ఫ్లెక్సీల చింపివేత రగడ కొనసాగుతోంది. నూతన సంవత్సరం నేపథ్యంలో అధికార కాంగ్రెస్ నాయకులు వారివారి గ్రామాల్లో ముఖ్యమైన కూడళ్ల వద్ద శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఈసాలతక్కళ్లపల్లి, బసంత్‌నగర్, వేంనూర్ గ్రామాల్లో పలు ఫ్లెక్సీలను సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. దీంతో గ్రామాల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆయా గ్రామాల నాయకులు బుధవారం బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్‌ను కలిసి విషయం గురించి వివరించారు.